సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



అట్టహాసంగా బేస్‌బాల్ పోటీలు
నిర్మల్‌లో రాష్ట్రస్థాయి అండర్–21 జూనియర్స్ బాలబాలికల బేస్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8లో▸



కలెక్టరేట్ రోడ్లకు సొబగులు
కైలాస్‌నగర్: ఈనెల 17న ప్రజాపాలన దినోత్సవం నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్‌లోనికి వెళ్లే ఇన్, ఔట్ గేట్‌ల రోడ్లకు సొబగులు అద్దుతున్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం
ఆకాశం పలుచోట్ల మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రిమ్స్‌కు ఐదుగురు వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిన ఐదుగురు వైద్యులు శనివారం విధుల్లో చేరినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. 17 పోస్టులకు సంబంధించి ఇటీవల ఇంటర్వ్యూలు నిర్వహించగా ఐదుగురు చేరారని పేర్కొన్నారు. మిగిలిన వైద్యులు సైతం త్వరలో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

‘పీఎం విశ్వకర్మ’ను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణను పరిశీలిస్తున్న రాజలింగు

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ పథకాన్ని కుల వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు అన్నారు. ఈ పథకంలో భాగంగా రజకుల కోసం పట్టణంలోని రాంనగర్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఏడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణలో భాగంగా తొలిరోజు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి పూచికత్తు లేకుండా రుణంతో పాటు శిక్షణ, వృత్తి సంబంధించిన కిట్లను అందిస్తారన్నారు. ఇందులో విశ్వకర్మ యోజన జిల్లా మేనేజర్ రాజేందర్ జాదవ్, శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఇంద్రవెల్లి: గ్రామీణులకు అందుబాటులో ఉంటూ సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. మండలంలోని పిట్టబొంగరం పీహెచ్‌సీ శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రసవాలు, ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీ సేవలు మెరుగుపరచాలని, సమయపాలన పాటించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, వైద్యుడు ప్రతాప్‌నాయక్, హెచ్‌ఈవో గోకుల్ తదితరులు ఉన్నారు.

రిక్రూట్ చేసిందెవరు..?

- అభ్యర్థులను దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు..
- ‘సాక్షి’ వరుస కథనాల నేపథ్యంలో స్పందించిన రిమ్స్ డైరెక్టర్
- నోటిఫికేషనే లేనప్పుడు ఎలా సాధ్యం అంటున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి
- మెరిట్‌లిస్ట్, అభ్యర్థుల వివరాలు మాత్రమే ఇచ్చామన్న డీఎంహెచ్‌వో
- రిమ్స్ అవుట్ సోర్సింగ్, స్టాఫ్‌నర్స్ పోస్టుల ఎంపికలో కొత్త ట్విస్ట్



రిమ్స్ ఆస్పత్రి



అమ్మకానికి నర్స్ పోస్టులు!?

ఈనెల 13న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనం

రిమ్స్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిన స్టాఫ్‌నర్స్ పోస్టుల కోసం ఎంపిక చేసిన జాబితాను ఈ నెల 4న ఆమోదం పొందిన వెంటనే అభ్యర్థులను దరఖాస్తులు సమర్పించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి తెలియజేశారు.. అవి అందిన వెంటనే కార్యాలయ సిబ్బంది అభ్యర్థులందరికీ 5న ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందించారు.. ఒరిజినల్ సర్టిఫికెట్లతో 6న రావాలని సూచించాం.. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో 40 మంది అభ్యర్థులు హాజరయ్యారు.. ఒక అభ్యర్థి స్థానికేతరుగా గుర్తించి తిరస్కరించాం.. ఆ తర్వాత ఇప్పటికే ఉన్న మూడు ఏజెన్సీలకు వర్క్ ఆర్డర్ కేటాయించాలని ఫైల్ సర్క్యులేట్ అయింది.. ఇందులో ఎలాంటి జాప్యం, అక్రమాలు చోటు చేసుకోలేదు..

ఇది రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ స్పందన

రిమ్స్‌లో అవుట్ సోర్సింగ్ పద్ధతిన స్టాఫ్‌నర్స్ నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఈ నెల 13న సాక్షిలో ‘అమ్మకానికి నర్స్ పోస్టులు’ శీర్షికన కథనం ప్రచురితం అయింది. దీనిపై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఒక ప్రకటనలో స్పందించారు. అందులో అభ్యర్థులను దరఖాస్తు ఫారాలు సమర్పించాలని డీఎంహెచ్‌వో తెలియజేశారని పేర్కొన్నారు. ఈ విషయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కృష్ణను ‘సాక్షి’ వివరణ కోరినప్పుడు అసలు నోటిఫికేషనే లేనప్పుడు దరఖాస్తు చేసుకోవాలని ఎలా సూచిస్తారని ఎదురు ప్రశ్నించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మెరిట్ లిస్టు, అభ్యర్థుల వివరాలు ఇవ్వడం వరకే మేము పరిమితమయ్యామని పేర్కొన్నారు. ముఖ్యమైన హోదాల్లో ఉన్న ఇద్దరు అధికారుల స్పందనలు ఇవి. దీంతో స్టాఫ్‌నర్స్ రిక్రూట్ చేసిందెవరు అన్న ప్రశ్న తలెత్తుతుంది.

– సాక్షి, ఆదిలాబాద్

మెరిట్ జాబితానే పంపించాం..

స్టాఫ్‌నర్స్ క్యాడర్‌కు సంబంధించి మెరిట్ జాబితానే రిమ్స్ డైరెక్టర్‌కు పంపించాం. గతంలో నోటిఫికేషన్ ద్వారా నియామకాలు చేపట్టిన తర్వాత మిగిలిన వారి జాబితాను పంపించాము. అభ్యర్థుల వివరాలు కూడా పొందుపరిచాం. అంతకుమించి వైద్యారోగ్యశాఖ నుంచి ఎలాంటి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టలేదు. – కృష్ణ, డీఎంహెచ్‌వో

నాన్‌లోకల్ తిరస్కరణ..

రిమ్స్ డైరెక్టర్ జారీ చేసిన ప్రకటనలో 40 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాగా అందులో ఒక అభ్యర్థి స్థానికేతరుగా గుర్తించి తిరస్కరించినట్లు పేర్కొన్నారు. అయితే 5 శాతం నాన్‌లోకల్ అభ్యర్థులను కూడా రిక్రూట్‌లో పరిగణలోకి తీసుకునే విధంగా నిబంధనలున్నట్లు ఈ విషయంపై అవగాహన ఉన్న ఓ అధికారి పేర్కొనడం గమనార్హం. ప్రస్తుతం బాసర జోన్ పరంగా చూస్తే నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల వారు లోకల్‌గా పరిగణించాల్సి వస్తుంది.ఇతర జిల్లాలు, రాష్ట్రాల వారు నాన్‌లోకల్‌గా పరిగణలోకి తీసుకుంటారు. అభ్యర్థికి మార్కులు అధికంగా ఉంటే నాన్‌లోకల్ తీసుకోవచ్చని చెబుతున్నారు. అయితే డైరెక్టర్ ప్రకటనలో మాత్రం ఒక అభ్యర్థి నాన్‌లోకల్‌గా గుర్తించి తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉట్నూర్ సమీప గ్రామంలోని అభ్యర్థిని ఏజెన్సీ నిర్వాహకుల్ని సంప్రదించిన తర్వాత డబ్బుల డిమాండ్‌తో ఆమె వెనుదిరగడం, ఆ తర్వాత ఎమ్మెల్యేను ఆశ్రయించడం జరిగినట్లు ‘సాక్షి’ కథనంలో పేర్కొన్నాం. ఆ అభ్యర్థికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ రాలేదని వివరించాం. దీంతోనే ఆ ప్రకటనలో ఒక అభ్యర్థిని నాన్‌లోకల్‌గా గుర్తించి తిరస్కరించామని పేర్కొన్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తద్వారా ఈ ప్రక్రియలో అక్రమాలు చోటు చేసుకోలేదని చెప్పుకోవడానికి చూస్తున్నారనే సందేహాలు కలుగుతున్నాయి.

ఆ ఏజెన్సీ వెనుకున్నదెవరు..

ఎలెన్ సాఫ్ట్ అవుట్ సోర్సింగ్ ఏజెన్సీని వెనుకుండి నడిపిస్తుందెవరోనన్న ప్రశ్నను పలు ఏజెన్సీల నిర్వాహకులు లేవనెత్తుతున్నారు. ఇందులో పలువురు ముఖ్యమైన అధికారుల పాత్ర ఉందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అంతే కాకుండా ఈ వ్యవహారంలో ఒక అధికారికి వైద్యారోగ్య శాఖ ఓ సంఘ నేత తోడ్పాటు ఉందని చెప్పుకుంటున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న స్టాఫ్‌నర్స్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియపై పరిశీలన చేస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పలువురు ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొంటున్నారు.

‘కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర’



సంతకాల సేకరణ చేపడుతున్న నాయకులు

ఎదులాపురం: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ఆరోపించారు. కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్‌తో భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలని ప్రతిపాదనను విరమించుకోవాలన్నారు. ఈ నేపథ్యంలోనే సంతకాల సేకరణ చేపట్టి ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ, నాయకులు సుభాష్, నర్సింగ్, దేవిదాస్, మారుతి, జగన్ సింగ్, ఉమ్రే నితిన్, రాజు, అశోక్, విట్టల్, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు ముమ్మరం



పెన్‌గంగ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ ఖమర్ అహ్మద్

- శోభాయాత్ర మార్గంలో చెట్ల కొమ్మల కత్తిరింపు, గుంతల పూడ్చివేత పనులు
- ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక చర్యలు



చెట్ల కొమ్మలను కత్తిరిస్తున్న బల్దియా సిబ్బంది

కైలాస్‌నగర్: గణేశ్ నిమజ్జన శోభాయాత్రను జిల్లాలో ఏటా ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడు ఈనెల 17న గంగమ్మ ఒడికి చేరనున్నాడు.ఈమేరకు నిమజ్జనోత్సవ ఏర్పాట్లను పట్టణంలో ముమ్మరం చేశారు. శోభాయాత్ర చేపట్టనున్న ప్రాంతాలతో పాటు ప్రధాన చౌక్‌ల్లో రోడ్లపై ఉన్న గుంతలను మొరం, స్టోన్‌డస్ట్‌తో పూడ్చివేస్తున్నారు. ఇప్పటికే ఈ పనులు తుది దశకు చేరాయి. రూట్‌మ్యాప్‌ను ఇప్పటికే ఖరారు చేయడంతో ఆయా మార్గాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బల్దియా సిబ్బంది చెట్ల కొమ్మలను కత్తిరిస్తున్నారు. అలాగే వేలాడుతున్న కరెంట్ తీగలను విద్యుత్ సిబ్బంది సరి చేస్తున్నారు. ఎలాంటి వివాదాలకు ఆస్కారమివ్వకుండా మసీదుల వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ప్రార్థన మందిరాలపై రంగులు పడకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి కవర్లతో కప్పేస్తున్నారు.

తాత్కాలిక టాయ్‌లెట్స్

శోభాయాత్రను తిలకించేందుకు జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు. ఈమేరకు వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక టాయ్‌లెట్స్ ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపాలిటీకి సంబంధించిన మొబైల్ టాయ్‌లెట్ బస్సుతో పాటు హైదరాబాద్ నుంచి మరో మూడు మొబైల్ టాయ్‌లెట్స్‌ను తెప్పించనున్నారు.ప్రసాద వితరణతో పాటు తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉన్నటువంటి ప్రాంతాల్లో ప్రత్యేక బారికేడ్లను ఏర్పాటు చేయనున్నారు.

గజ ఈతగాళ్లు సిద్ధం

విగ్రహాలను నిమజ్జనం చేసే చాంద వాగుతో పాటు పెన్‌గంగ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వారిని ఇప్పటికే ఎంపిక చేసిన ఆ శాఖ అధికారులు వారికి అవసరమైన లైఫ్ జాకెట్స్‌ను అందజేశారు. పెన్‌గంగ వద్ద పది మంది, చాందా వద్ద పది మంది చొప్పున ఆదివారం నుంచి వీరు అందుబాటులో ఉండనున్నారు. అలాగే పెన్‌గంగ వద్ద ప్రత్యేక క్రేన్ల ఏర్పాటుతో పాటు లైటింగ్ సైతం ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మంత్రి ‘తుమ్మల’ను కలిసిన డీసీసీబీ చైర్మన్



మంత్రిని కలిసిన భోజారెడ్డి

కైలాస్‌నగర్: రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎస్ క్యాబ్ చైర్మన్ రవీందర్‌రావు ఆధ్వర్యంలో డైరెక్టర్లతో కలిసి హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. సాంకేతిక కారణాలతో నిలిచిన జిల్లాలోని అర్హులైన రైతుల రుణాలు మాఫీ అయ్యేలా చూడాలని మంత్రిని కోరారు. అలాగే ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించినట్లుగా ఆయన తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని, అర్హులైన ప్రతి రైతుకు త్వరలోనే రుణమాఫీ చేస్తామని, బాధిత రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లుగా ఆయన పేర్కొన్నారు.

‘ఎమ్మెల్సీ’ కసరత్తు!



- నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ షురూ
- పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీకి ఎన్నికలు
- పోటీలో నిలిచేందుకు ఆశావహుల సన్నద్ధం

ఓటరు నమోదు వివరాలు..
ఈ నెల 30న పబ్లిక్ నోటీసు
అక్టోబర్ 16న మొదటి సారి పబ్లికేషన్
అక్టోబర్ 25 రెండోసారి పబ్లికేషన్
నవంబర్ 6వరకు ఓటరు నమోదుకు గడువు
నవంబర్ 23న ముసాయిదా జాబితా
నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9వరకు అభ్యంతరాల స్వీకరణ
డిసెంబర్ 25వరకు అభ్యంతరాల పరిష్కారం
డిసెంబర్ 12న ఓటరు జాబితా ప్రచురణ
డిసెంబర్ 30న తుది జాబితా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఖాళీ అవుతున్న శాసనమండలిలోని స్థానాలకు తిరిగి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే మార్చి 29న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పదవీ కాలం పూర్తి కానుంది. ఇదే జిల్లాల పరిధిలోని టీచర్స్ శాసనమండలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పదవీ కాలం కూడా పూర్తవనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులతోపాటు అర్హులైన ప్రభుత్వ టీచర్లను కొత్త ఓటర్లుగా నమోదు, ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. అంతా పూర్తి చేసి వచ్చే డిసెంబర్ వరకు తుది జాబితా సిద్ధం చేయనుంది. దీంతో నూతనంగా నమోదైన ఓటర్లతో వచ్చే ఆరునెలల్లోపు ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు కొత్తగా పట్టభద్రులను ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. వచ్చే నవంబర్ 11నాటికి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన పట్టభద్రులకు ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించింది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

ఆశావహులు రెడీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రణాళికలు వేస్తున్నారు. ఆ మేరకు ఆయా జిల్లాల పరిధిలో బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో పోటీలో ఉండే ఆశావహులు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యావంతులు, ఉపాధ్యాయ వర్గాలకు పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ చేరువ అవుతున్నారు. రాష్ట్రంలో 42అసెంబ్లీ స్థానాలు, ఆరు లోక్‌సభ స్థానాల పరిధిలో ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధి విస్తరించి ఉండడంతో ఓటర్లను కలవడం, ప్రచారం చేయడం అభ్యర్థులకు కష్టతరం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు సిద్ధపడుతున్న ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ మేరకు బరిలో ఉండే రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థులు, స్వతంత్రులు సైతం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన పలువురు నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు. విద్యార్థులు, టీచర్ల సంఘాలతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మంచిర్యాల పరిధిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు పార్టీ నాయకత్వం ఆదేశిస్తే పోటీలో ఉండేందుకు సిద్ధంగా ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం నిర్మల్ జిల్లాకు చెందిన కృష్ణారావు బరిలో ఉంటామని సంకేతాలు ఇస్తున్నారు. వీరితో పాటు పలువురు విద్యావంతులు, రాజకీయ నాయకులు, ప్రైవేటు టీచర్ల అసోసియేషన్ నుంచి పట్టభద్రుల స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గ పరిధి విస్తృతంగా ఉండడంతో ఆయా జిల్లాల పరిధిలో పోటీలో ఉన్న వారు తమ పార్టీ నాయకుల మద్దతుతోపాటు స్థానికులు, ఇతర జిల్లాల్లోనూ మద్దతు కూడగట్టాల్సి ఉంది. దీంతో ఎక్కడి నుంచి ఎవరు తుది వరకు బరిలో ఉంటారనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

విద్యుత్ బకాయిలు @ రూ.4కోట్లు

- బల్దియాకు గుదిబండగా కరెంట్ బిల్లులు
- చెల్లింపుపై తల పట్టుకుంటున్న అధికారులు
- వీధి దీపాల నిర్వహణపై చేతులెత్తేసిన ఏజెన్సీ

ఆదిలాబాద్ పట్టణంలోని వీధి దీపాల వివరాలు
18 వాట్స్‌వి : 11773
70 వాట్స్‌వి : 1444
110 వాట్స్‌వి : 883
190 వాట్స్‌వి : 90
సీసీఎం టైమర్ బాక్స్‌లు : 460
తాగునీటి కనెక్షన్లు : 30



కిసాన్‌చౌక్‌లో వెలుగని హైమాస్ట్ లైట్లు

కైలాస్‌నగర్: గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీకి విద్యుత్ బిల్లులు గుదిబండగా మారాయి. సకాలంలో చెల్లించకపోవడంతో బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ప్రస్తుతం విద్యుత్‌శాఖకు రూ.4కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీనికి తోడు పట్టణంలోని వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించే ఏజెన్సీకి సైతం ఏడాది కాలంగా బిల్లులు చెల్లించడం లేదు. అవి కూడా కోట్లలోనే పేరుకుపోయాయి. ఫలితంగా సదరు ఏజెన్సీ వీధి దీపాల నిర్వహణపై చేతులెత్తేసింది. అసలే నిధుల లేమితో సతమతమవుతున్న మున్సిపాలిటీకి పెండింగ్ విద్యుత్ బిల్లులు మరింత భారంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక చేయూత కొరవడటం, జనరల్ ఫండ్ నిధులు కార్మికుల వేతనాలకే సరిపోవడంతో కరెంట్ బిల్లులు చెల్లించలేని పరిస్థితి.

పేరుకుపోయిన బకాయిలు

ఆదిలాబాద్ పట్టణంలో వీధి దీపాలు, తాగునీటి పథకాలు, లాండసాంగ్వి పంప్‌హౌస్, బంగారుగూడ డంపింగ్‌యార్డు, బోరుబావులు, బల్దియా కార్యకలాపాలకు సంబంధించి విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి వినియోగించిన విద్యుత్‌కు గాను ప్రతి నెలా రూ.25లక్షల నుంచి రూ.30లక్షల బిల్లులు వస్తాయి. వీటిని పట్టణ ప్రగతి కింద మున్సిపాలిటీకి వచ్చే రూ.1.29 కోట్ల నుంచి చెల్లించేవారు. అయితే ఏడాదిగా ఈ నిధుల విడుదల నిలిచిపోయింది. జనరల్ ఫండ్ ఉన్నప్పటికీ అవి పారిశుద్ధ్య నిర్వహణ, కార్మికుల జీతభత్యాల చెల్లింపులకే సరిపోతున్నాయి. దీంతో విద్యుత్ బిల్లులను చెల్లించలేని పరిస్థితి తలెత్తింది. బకాయిలు ఏకంగా రూ.4కోట్లకు చేరాయి. వీటి చెల్లింపు బల్దియాకు పెను భారంగా మారింది.

చేతులెత్తేసిన ఏజెన్సీ ..

పట్టణంలోని సెంట్రల్ లైటింగ్‌తో పాటు హైమాస్ట్ లైట్లు, కాలనీల్లోని వీధి దీపాల నిర్వహణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందంలో భాగంగా ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) అనే ఏజెన్సీకి అప్పగించింది. వీటి నిర్వహణకు గాను మున్సిపల్ నుంచి ఆ ఏజెన్సీకి నెలకు రూ.13.90లక్షలు చెల్లించేవారు. అయితే నిధుల కొరత కారణంగా వాటిని కూడా చెల్లించడం లేదు. ఆ బకాయిలు సైతం రూ.3కోట్లకు చేరాయి. దీంతో సదరు ఏజెన్సీ పూర్తిగా చేతులెత్తేసింది. వీధి దీపాలు చెడిపోతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. దీంతో పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్‌లైట్లు పూర్తిస్థాయిలో వెలుగడం లేదు. ఇక పలు కాలనీల్లోనూ అంధకారమే నెలకొంటుంది. వీధి దీపాలు రాత్రి పూట వెలిగి, ఉదయం బంద్ అయ్యేలా ప్రత్యేక టైమర్‌తో కూడిన బాక్స్‌లు సైతం ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం అవి కూడా పనిచేయడం లేదు. గణేశ్ నవరాత్రోత్సవాల నేపథ్యంలో బల్దియా అధికారులు ప్రస్తుతం కొన్ని చోట్ల లైట్లను ఏర్పాటు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఎక్కడా వెలుగడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే కాలనీల్లో అంధకారం తప్పేలా కనిపించడం లేదు.

నిధుల కొరతతోనే..

ప్రభుత్వం నుంచి రావాల్సిన పట్టణ ప్రగతి నిధులు రావడం లేదు. దీంతో మున్సిపల్ పరిధిలో నిధుల కొరత తీవ్రమై విద్యుత్ బిల్లులను చెల్లించలేని పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే వాటిని పూర్తిస్థాయిలో విద్యుత్‌శాఖకు చెల్లిస్తాం. ఇక వీధి దీపాల నిర్వహణను పర్యవేక్షించే ఏజెన్సీకి రాష్ట్ర ప్రభుత్వమే నిధులు చెల్లించాల్సి ఉంటుంది. ఆ బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రమంతా మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి.
– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

డాక్టర్ పట్టా అందుకున్న గిరిజన మహిళ



పట్టా అందుకుంటున్న లలిత

బెజ్జూర్: మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ సడిమెక లలిత ఓయూలో పీజీ, ఎంఏ తెలుగు పూర్తిచేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించే అధ్యాపక పరీక్ష కోసం యూజీసీ నెట్ జేఆర్ఎఫ్ సెట్‌కు అర్హత సాధించింది. ఈమె హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ప్రాచ్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. ఉస్మానియా ఓరియంటల్ తెలుగు విభాగంలో డాక్టర్ అజ్మీర సిల్మానాయక్ పర్యవేక్షణలో 'పరిణితవాని ప్రసంగాలు–సాహిత్య, సాంస్కృతిక అధ్యయనం'అనే అంశంపై పరిశోధన పూర్తి చేసింది. ఇందుకుగాను శనివారం ఆమెకు డాక్టరేట్ పట్టా అందుకుంది. పట్టా అందుకున్న ఆమెను తల్లిదండ్రులు పార్వతి–శంకర్, మండల ప్రజలు అభినందించారు.

18న కార్మిక సమస్యలపై ధర్నా

బెల్లంపల్లి: కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ తెలిపారు. శనివారం బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. మల్లయ్య, చరణ్, చంద్రయ్య పాల్గొన్నారు.

అట్టహాసంగా బేస్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీఎస్పీ గంగారెడ్డి
- 22 జిల్లాల నుంచి 980 మంది క్రీడాకారులు హాజరు



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్–21 జూనియర్స్ బాల, బాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల్లో జరిగే పోటీలను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఆటల్లో సత్తాచాటి జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుంద్రు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి గంగాధర్ నేతృత్వంలో నిర్వహిస్తున్న పోటీల్లో 22 జిల్లాల నుంచి మొత్తం 980 మంది క్రీడాకారులు, 22 మంది కోచ్‌లు, 22 మంది సబ్ కోచ్‌లు పాల్గొన్నారు. మొదటి రోజు నిర్వహించిన పోటీల్లో హైదరాబాద్ బాలుర జట్టు, పెద్దపల్లి జట్టు తలపడ్డాయి. ఇందులో హైదరాబాద్ 7–0తో విజయం సాధించింది. బాలికల జట్టులో రంగారెడ్డి, సిద్దిపేట జట్లు తలపడ్డాయి. ఇందులో రంగారెడ్డి 08–01తో గెలుపొందింది. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజస్థాన్‌లోని బిక్నూరులో ఈనెల 30 నుంచి జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ జమున, పీటీ భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలు అంటే ఇష్టం



నాకు చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టం. గత మూడేళ్ల నుంచి బేస్‌బాల్‌లో మెలకువలు నేర్చుకున్నా. ఇప్పుడు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇప్పటివరకు మూడు రాష్ట్రస్థాయి, ఒకటి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబర్చి ముందుకెళ్లాలని కోరిక.

– స్పందన, నిర్మల్ జట్టు

జాతీయ స్థాయికి ఎంపికవుతా..



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికవుతా. ఇప్పటివరకు 4 జాతీయస్థాయి, 7 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ప్రపంచ స్థాయిలో పాల్గొనాలనేదే నా లక్ష్యం.

– బిందు, కామారెడ్డి జట్టు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి ముందుకెళ్తున్నా. గత మూడేళ్ల నుంచి బేస్‌బాల్ నేర్చుకున్నా. ఇప్పటివరకు మూడు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపిక కావడమే లక్ష్యం. – పరమేశ్వర్ మహబూబాబాద్ జట్టు

జిల్లాకు పేరు వస్తుంది



రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు అన్ని రకాల వసతులు కల్పించాం. 22 జిల్లాల నుంచి 22 జట్లు ఇక్కడికి వచ్చాయి. ఈ పోటీలు నిర్వహించడంతో జిల్లాకు ఎంతో పేరు వస్తుంది. – సుధాకర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు

చదువుపై ఆసక్తి..మూడు కొలువులు కొట్టి



ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో సెలూన్ షాప్ నిర్వాహకుడు గంగాధర్ కుమారుడు ఉదయ్‌కుమార్ చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తితో మూడు కొలువులు కొట్టాడు. గ్రూప్–4 పరీక్షలు రాసి ఏఈఈలో 159 ర్యాంక్, పాలిటెక్నిక్ లెక్చరర్‌లో 166వ ర్యాంక్, ఏఈలో 366వ ర్యాంకు సాధించి మూడు కొలువు సాధించాడు. ఇష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చునని, తనను చదివించిన తల్లిదండ్రులకు రుణపడి ఉంటానని ఉదయ్‌కుమార్ తెలిపాడు. ఉదయ్‌కుమార్‌కు శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. ఆయన నివాసంలో కుటుంబ సభ్యులను సన్మానించారు. నాయకులు గర్షకుర్తి వెంకటేశ్, పుండలిక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి..మూడు కొలువులు సాధించి



తల్లిదండ్రులతో సాయికృష్ణ

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని చించర్‌వాడ కాలనీకి చెందిన ముత్యాల సాయికృష్ణ 2018లో గ్రూప్–4 పరీక్షలో సత్తాచాటి ఆసిఫాబాద్ ఎస్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. 2022లో మళ్లీ గ్రూప్–4 పరీక్ష రాసి ర్యాంకు సాధించాడు. గత ఆగస్టులో కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పట్టుదలతో చదివి మూడు ప్రభుత్వ కొలువులు సాధించాడు. ఈయన తల్లిదండ్రులు పొచ్చన్న–రూప. ప్రస్తుతం ఇంటెలిజెన్స్‌లో అసిస్టెంట్ ఎనలైటిక్ అధికారిగా ఉద్యోగంలో చేరుతానని సాయికృష్ణ తెలిపారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్టు



తిర్యాణి పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చలో జైనూర్ కార్యక్రమానికి వెళ్లకుండా జిల్లాలోని బీజేపీ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, తిర్యాణి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జైనూర్ ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న తమను శుక్రవారం అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు నాయకులు తెలిపారు. పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధికారి ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ చౌదరి, విశాల్ ఖాండ్రే, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, అసెంబ్లీ కన్వీనర్ రమేశ్ గౌడ్, తిర్యాణి మండల అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



గెలుపొందిన విద్యార్థులు

చెన్నూర్: లక్సెట్టిపేటలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–18లో 1000 మీటర్ల పరుగుపందెంలో టి.ప్రశాంత్ (ప్రథమ), లాంగ్ జంప్‌లో ఆర్.శ్రావణ్‌కుమార్ (ప్రథమ), హైజంప్‌లో (ద్వితీయ), డిస్క్‌త్రో, జావెలిన్ త్రోలో అజయ్ (ద్వితీయ), 600 మీటర్ల పరుగుపందెంలో టి.రిషిత్ (ప్రథమ) స్థానాల్లో గెలుపొందారని ప్రిన్సిపాల్ కేపీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ ఉస్మానియా కళాశాల మైదానంలో ఈనెల 19, 20 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయిపోటీల్లో వారు పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ విజయ్‌కుమార్, ఏటీపీ, డిప్యూటీ వార్డెన్‌లు శ్రీకాంత్, సునీల్ పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన బస్సు ప్రమాదం



నర్సాపూర్(జి): మండలంలోని అర్లి (కె) ఎక్స్‌రోడ్ సమీపాన ఆర్టీసీ బస్సుకు శనివారం సాయంత్రం త్రుటిలో ప్రమాదం తప్పింది. భైంసా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 120 మంది ప్రయాణికులతో వెళ్తోంది. అర్లి (కె) ఎక్స్‌రోడ్ సమీపాన 61వ జాతీయ రహదారి వద్ద బస్సు టైర్ పేలింది. డ్రైవర్ గంగాధర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కన నిలపడంతో ప్రమాదం తప్పింది.

భార్యాభర్తల రిమాండ్

చింతలమానెపల్లి: రవీంద్రనగర్–2 పంచాయతీలో ఈనెల 11న జరిగిన దాడి ఘటనలో భార్యాభర్తలను శనివారం రిమాండ్ తరలించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బుధవారం రాత్రి సమయంలో అన్నదమ్ములు కృష్ణ మండల్, పవిత్రమండల్ మధ్య వివాదం చోటు చేసుకుంది. అన్న కృష్ణమండల్‌పై తమ్ముడు, అతని భార్య ఉమ మండల్ కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి భార్య హీరామండల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

భీమారం: మండలంలోని పోలంపల్లికి చెందిన యువకుడు నర్మెట్ట సందీప్ చికిత్సపొందుతూ హన్మకొండ ఆసుపత్రిలో మృతిచెందాడు. హెడ్ కానిస్టేబుల్ మాచర్ల కథనం ప్రకారం.. పోలంపల్లికి చెందిన సందీప్ (22) హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. తల్లి ఆరోగ్యం బాగాలేకపోవడంతో గతనెల 22న రాఖీ పండుగ రోజు ఇంటికి వచ్చాడు. తల్లి అనారోగ్యం బారిన పడడం చూసి బాధపడ్డాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌కు పంపించి చికిత్స అందించారు. కోలుకున్నాక తిరిగి అతన్ని ఇంటికి తీసుకువచ్చారు. తిరిగి సందీప్ ఆరోగ్యం క్షీణించడంతో హన్మకొండకు తరలించారు. చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. తండ్రి సురేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కిడ్నాప్ కేసు నమోదు

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శాకపురం శంకరయ్యపై శనివారం కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. శనివారం మత్స్యకారుల ఎన్నికలు ఉండడంతో గ్రామానికి చెందిన పందిరి లింగయ్య, గుమ్ముల సంతోష్ పోటీగా ఉన్నారని వారిద్దరిని ఈ నెల 13న శంకరయ్య మాయమాటలు చెప్పి కారులో గుర్తు తెలియని ప్రదేశానికి తీసుకెళ్లాడని పేర్కొన్నారు. రాత్రి వరకు ఇద్దరు ఇంటికి రాకపోవడంతో అనుమానంతో లింగయ్య భార్య సరోజన శనివారం ఉదయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నిమజ్జనానికి రావాలని ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందిస్తున్న సమితి సభ్యులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌తోపాటు వివిధ గ్రామాల్లో సోమవారం గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించేందుకు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమానికి రావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఎస్పీ నాగేందర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రాంప్రసాద్, ప్రత్యేక అధికారి ప్రభాకర్‌లకు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కొండేరి రమేశ్, శికారి శ్రీనివాస్, దేవిదాస్, తిరుపతి, అరికిల్ల అశోక్, గోపాల్‌సింగ్, వెంకటేశ్, బొంత ఆశారెడ్డి, లింగాగౌడ్ తదితరులు ఉన్నారు.

ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేస్తాం



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గల్ఫ్ సంఘాల నాయకులు

- రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- హైదరాబాద్‌లో అత్యవసర సమావేశం
- పాల్గొన్న గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు

నిర్మల్‌ఖిల్లా: తెలంగాణ ప్రవాసీ విధానం (ఎన్ఆర్ఐ పాలసీ) అమలు చేస్తామని రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులతో రాష్ట్రస్థాయి అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశానికి నిర్మల్ జిల్లాకు చెందిన గల్ఫ్ కార్మిక సంక్షేమ సంఘం నాయకుడు స్వదేశ్ పరికిపండ్ల హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు సంఘాల నాయకులతో చర్చించినట్లు స్వదేశ్ వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిస్థితులు, ఉపాధి కోసం గల్ఫ్ దేశాల బాటపడుతున్న తీరును గురించి ప్రధానంగా చర్చించినట్లు పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం నాలుగు అంశాలపై చర్యలు చేపట్టనున్నట్లు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిపారు. గతేడాది డిసెంబర్ 7 నుంచి ఇప్పటివరకు గల్ఫ్ దేశాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షలు చెల్లింపు, గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమంపై అధ్యయనానికి సలహా కమిటీ ఏర్పాటు, హైదరాబాద్ ప్రజాభవన్‌లో 'ప్రవాసీ ప్రజావాణి'ఏర్పాటు, గురుకుల విద్యాసంస్థల్లో గల్ఫ్ కార్మికుల పిల్లలకు అడ్మిషన్లలో ప్రాధాన్యత కల్పించడం.. తదితర నిర్ణయాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, సారంగాపూర్ తాజా మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, గల్ఫ్ సంఘాల నాయకులు వినోద్‌కుమార్, మంద భీమ్‌రెడ్డి నరేశ్‌రెడ్డి, శ్రీనివాసరావు, రాజేందర్‌రావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో సెక్యూరిటీ గార్డు మృతి!



నవీన్ మృతదేహం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ సెక్యూరిటీ గార్డుగా సిడాం నవీన్ పాముకాటుతో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..తిర్యాణి మండలం నాయకపుగూడకు చెందిన నవీన్ (24), మహారాష్ట్రకు చెందిన వైభవ్ రావత్‌లు కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహించి శుక్రవారం రాత్రి కంపెనీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వెనుకాల వారికి కేటాయించిన బ్యారక్ (షెడ్)లో నిద్రించారు. శనివారం తెల్లవారుజామున నవీన్, వైభవ్ రావత్‌కు కడుపునొప్పి, వాంతులు అయ్యాయి. పక్కన ఉన్న సెక్యూరిటీ సిబ్బంది గమనించి మంచిర్యాల మెడిలైఫ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నవీన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వైభవ్‌ను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించిన విషయం తెలుసుకున్న ఆదివాసీ సంఘాలు అక్కడకి చేరుకుని ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం, పోలీసులు సాయంత్రం వరకు చర్చలు జరిపి మృతుడి కుటుంబానికి రూ.8 లక్షల ఆర్థికసాయం, కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం, తల్లిదండ్రులకు నెలకు రూ.6 వేల చొప్పున పెన్షన్ మాదిరి ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలపడంతో వివాదం సద్దుమణిగింది. కాగా మృతుడు, బాధితుడు కడుపునొప్పి, వాంతులు రావడం ఫుడ్ పాయిజన్ అయి ఉండవచ్చునని, పాముకాటు వేసిందా అనే అనుమానాలను తోటి ఉద్యోగులు లేవనెత్తుతున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక వివరాలు తెలుస్తాయని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

బ్యాంక్‌లో చోరీకి విఫలయత్నం



వెంటిలేటర్‌కు ఉన్న ఇనుప చువ్వలు తొలగించిన దృశ్యం



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న క్లూస్‌టీం సిబ్బంది

ముధోల్: మండల కేంద్రంలోని ఎస్బీఐలో గుర్తుతెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం చేశారు. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం.. దుండగులు బ్యాంకు వెనుక భాగంలో వెంటిలేటర్‌కు ఉన్న ఇనుప చువ్వలు తొలగించి చొరబడ్డారు. సీసీకెమెరాలు, అలారం వైర్లు ఎత్తుకెళ్లారు. బ్యాంక్‌లో సంచరించి వెళ్లిపోయారు. శనివారం ఉదయం బ్యాంక్ సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సైతో కలిసి సీఐ మల్లేశ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం సిబ్బంది డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేసి, ఫింగర్ ప్రింట్ ఆధారాలు సేకరించారు. ఈ ఘటనలో నగదు చోరీకి గురికాలేదని ఎస్సై తెలిపారు. బ్యాంకు మేనేజర్ ఎస్‌వీ గిరి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.